# సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి డిఎంహెచ్వో

డా. వెంకటరమణ



సూర్యాపేట,జూలై 9(వుదయం): వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. వెంకటరమణ సూచించారు.జ్వరం, జలుబు, దగ్గు లేదా ఇతర అనారోగ్య లక్షణాలు 2 నుంచి 3 రోజుల పాటు కొనసాగితే వాటిని ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దని తెలిపారు. తప్పనిసరిగా సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పి హెచ్ సి) సందర్శించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

స్వీయ చికిత్సకు పాల్పడకుండా వైద్యుల సూచనల మేరకు చికిత్స తీసుకోవడం ద్వారా వ్యాధులు తీవ్రం కాకుండా నివారించవచ్చని అన్నారు.నిల్వ నీరు వద్దు - దోమలకు అవకాశం ఇవ్వొద్దు సీజనల్ వ్యాధుల నివారణలో వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని డిఎంహెచ్వో పేర్కొన్నారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండే పరిస్థితులను పూర్తిగా నివారించాలని సూచించారు. నిల్వ నీటిలోనే దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని తెలిపారు.ఇళ్లలో ఉపయోగించకుండా ఉన్న పాత టైర్లు, పాత ఎయిర్ కూలర్లు, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, డబ్బాలు, బకెట్లు, ఇతర పాత్రల్లో నీరు నిల్వ ఉండకుండా తరచూ పరిశీలించి శుభ్రం చేయాలన్నారు. ఇంటి నీటి ట్యాంకులను కూడా క్రమం తప్పకుండా శుభ్రం చేయడంతో పాటు మూతలు వేసి ఉంచాలని తెలిపారు.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని డిఎంహెచ్వో పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు, స్థానిక సంస్థలు, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే సీజనల్ వ్యాధులను సమర్థవంతంగా అరికట్టవచ్చని అన్నారు.జ్వరం, జలుబు, ఒళ్లునొప్పులు, తలనొప్పి లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రి లేదా సమీప పి హెచ్ సి ను సంప్రదించి వైద్య సేవలు పొందాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# గుడిసెలోనే రాళ్లాపురం అంగన్వాడీ

- చిన్నారులకు కష్టకాలం!
- శాశ్వత టీచర్ లేక, పక్కా భవనం కరువై.
- విద్యాబోధనకు తీవ్ర ఇబ్బందులు





చర్ల, జూలై 9 (వుదయం):భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తిప్పాపురం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న రాళ్లాపురం అంగన్వాడీ కేంద్రం సమస్యలతో సతమతమవుతోంది. చిన్నారులకు నాణ్యమైన ప్రాథమిక విద్య, పోషకాహారం అందించాల్సిన ఈ కేంద్రంలో ప్రస్తుతం 24 మంది పిల్లలు ఉన్నప్పటికీ, వారికి శాశ్వత అంగన్వాడీ టీచర్ లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.గ్రామస్తుల కథనం ప్రకారం, ఈ కేంద్రానికి నియమిత టీచర్ లేకపోవడంతో కమలాపురం గ్రామానికి చెందిన అంగన్వాడీ టీచర్ రెండు లేదా మూడు రోజులకు ఒకసారి మాత్రమే వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. దీంతో పిల్లలకు ప్రతిరోజూ విద్యాబోధన జరగడం లేదని, అంగన్వాడీ సేవలు కూడా పూర్తిస్థాయిలో అందడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదే కాకుండా, ఈ కేంద్రానికి పక్కా భవనం కూడా లేకపోవడంతో చిన్న గుడిసెలోనే అంగన్వాడీ నిర్వహిస్తున్నారు. వర్షాకాలంలో గుడిసెలో నీరు కారడం, తడి వాతావరణం ఏర్పడడం వల్ల చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. వర్షం పడిన రోజుల్లో పిల్లలను కేంద్రానికి పంపడానికే తల్లిదండ్రులు వెనుకంజ వేస్తున్న పరిస్థితి నెలకొంది.విద్యకు పునాది వేసే బాల్యదశలోనే ఇటువంటి పరిస్థితులు ఉండడం వల్ల చిన్నారుల అభ్యాసంపై ప్రతికూల ప్రభావం పడుతోందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రాథమిక విద్య, బాలల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని చెబుతున్నప్పటికీ, రాళ్లాపురం వంటి మారుమూల గ్రామాల్లో మాత్రం కనీస వసతులు కూడా అందుబాటులో లేకపోవడం అధికార యంత్రాంగం నిర్లక్ష్యాన్ని ప్రశ్నించేలా ఉందని గ్రామస్తులు విమర్శిస్తున్నారు.

24 మంది చిన్నారులు ఉన్న ఈ అంగన్వాడీ కేంద్రానికి వెంటనే శాశ్వత టీచర్‌ను నియమించడంతో పాటు, పక్కా భవనాన్ని నిర్మించి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని గ్రామస్తులు, పిల్లల తల్లిదండ్రులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, చిన్నారుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి రాళ్లాపురం అంగన్వాడీ సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఘనంగా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చీమలమర్రి మురళీకృష్ణ జన్మదిన వేడుకలు



చర్ల, జూలై 9 (వుదయం):చర్ల మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు చీమలమర్రి మురళీకృష్ణ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ కుమార్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు,

కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మురళీకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్ ప్రత్యేక కేక్‌ను కట్ చేసి మురళీకృష్ణకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుని సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ కుమార్ నాయుడు మాట్లాడుతూ, చీమలమర్రి మురళీకృష్ణ చర్ల మండలంతో పాటు జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆయన ఆయురారోగ్యాలతో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహిస్తూ ప్రజాసేవలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

ఈ వేడుకల్లో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, పున్నం రామకృష్ణ,సాల్మన్, ఆవుల పుల్లారావు, ఆవుల శ్రీనివాసరావు, మడకం పద్మజ,మేడబత్తిన వాసు, మాత వాసు , కార్యకర్తలు,

అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని మురళీకృష్ణకు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## పేదల పెన్నిధి..... సీఎం సహాయనిది... అత్యవసర వైద్య చికిత్స అవసరమున్న పేదలకు... ఆపద్బాంధవు.... సీఎం సహాయ నిధి.... ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

యాదాద్రి భువనగిరి జిల్లా జూలై 9(వుదయం): గూడూరు గ్రామానికి చెందిన రాగిరు లక్ష్మి W/O శంకర్ గౌడ్ గారి అత్యవసర వైద్య ఖర్చుల నిమిత్తం.300000/- రూపాయల సీఎం సహాయ నిధిని( లాజ) మంజూరు చేసిన భువనగిరి శాసనసభ్యులు శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారు... సర్పంచ్ బింగి అలివేలు మంగ శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షులు పాలకూరి శ్రీనివాస్ గౌడ్ సంబంధిత లబ్ధిదారులు శంకరయ్య గౌడ్ గారికి ఎల్ వో సి చెక్ ను అందజేశారు.



# కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్‌కు నూతన ఎస్సైగా షేక్ యాకుబ్



కోదాడ, జూలై 9(వుదయం)
కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్ నూతన సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై)గా షేక్ యాకుబ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు.ఇంతకుముందు కోదాడ రూరల్ ఎస్సైగా విధులు నిర్వహించిన గోపాల్ రెడ్డి బదిలీపై నేరేడుచర్ల పోలీస్ స్టేషన్‌కు వెళ్లడంతో, ఆయన స్థానంలో షేక్ యాకుబ్ బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది నూతన ఎస్సైకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు ప్రాధాన్యతనిస్తూ సమర్థవంతమైన పోలీసింగ్ అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## అగ్ని ప్రమాద బాధితుడుని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే తాటి





అశ్వరావుపేట, జూలై 9(వుదయం ):
వేలేరుపాడు మండలం జగన్నాధపురం గ్రామంలో ఇబ్రహీం నివాసంలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో ఆస్తి నష్టం సంభవించిన నేపథ్యంలో, బూర్గంపహాడ్, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.ఈ సందర్భంగా బాధితులకు ధైర్యం చెప్పి, జరిగిన నష్టాన్ని తెలుసుకుని వారికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు.ప్రభుత్వం కూడా వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి తగిన సహాయం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సమీర్ , డాక్టర్ శ్రీనివాస్ , రామ్ లాల్ , నయీమ్ , గౌస్ , మాజీ జడ్పీటీసీ సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

# కోదాడ ఆర్టీఏ యూనిట్‌లో ఏఎంవీఐగా పి. శ్రవంతి బాధ్యతల స్వీకరణ



కోదాడ, జూలై 9(వుదయం)
కోదాడ ఆర్టీఏ యూనిట్ కార్యాలయంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ)గా శ్రీమతి పి. శ్రవంతి గురువారం విధుల్లో చేరారు. పోలీస్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసిన అనంతరం మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ షేక్ జిలానీకి రిపోర్ట్ చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు. ఆమె నియామకంతో రహదారి భద్రత, మోటార్ వాహన చట్టాల అమలు, ప్రజలకు సేవలు మరింత సమర్థవంతంగా అందుతాయని అధికారులు తెలిపారు.

# శ్రీశ్రీశ్రీ పశ్చిమాభిముఖ కోదండ రామాలయం, బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న తాటి





దమ్మపేట, జూలై 9 (వుదయం): దమ్మపేట మండలం చలమప్పగూడెం గ్రామంలో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ పశ్చిమాభిముఖ కోదండ రామాలయం మరియు బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవంలో బూర్గంపహాడ్, అశ్వారావుపేట మాజీ శాసనసభ్యులు, తెలంగాణ రాష్ట్ర మాజీ తొలి ట్రైకార్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారిని దర్శించుకుని అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజలు, ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు తాటి వెంకటేశ్వర్లు ను శాలువాతో ఘనంగా సన్మానించారు.అలాగే ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు తన వంతు సహాయంగా రూ.10,000 విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకారం అందిస్తానని తాటి వెంకటేశ్వర్లు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నడిగూడెం ఎస్సైగా తేజస్విని బాధ్యతలు

కోదాడ జూలై 9:(వుదయం )నడిగూడెం పోలీస్ స్టేషన్ ఎస్సైగా తేజస్విని గురువారం బాధ్యతలు స్వీకరించారు.ఇంతకుముందు ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్సై అజయ్ బదిలీపై వెళ్లడంతో ఆమె బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది ఆమెకు స్వాగతం పలికి, విధుల్లో విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.




# గెలుపు వరకు ఒకలా గెలిచాక మరోలా

## కార్యకర్తల ఆవేదన




మునగాల జూలై 09 ( వుదయం ):ఎన్నికల సమయంలో పార్టీ అభివృద్ధి కోసం, అభ్యర్థి గెలుపు కోసం అహర్నిశలు శ్రమించిన కార్యకర్తలు, నాయకులు గెలుపు అనంతరం తీవ్ర మనోవేదనకు గురవుతున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అనేక ఎన్నికల్లో పార్టీ జెండాను భుజాన మోసి, ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించి, పార్టీ బలోపేతానికి కృషి చేసిన కార్యకర్తలను అధికారం చేతిలోకి వచ్చిన తర్వాత పక్కన పెట్టడం పట్ల అసంతృప్తి వ్యక్తమవుతోంది. ముఖ్యంగా మునగాల మండల కేంద్రంలో
పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసిన వారిని గుర్తించకుండా, వారి సేవలను విస్మరించడం వల్ల క్షేత్రస్థాయిలో పార్టీ బలహీనపడే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. పార్టీకి సేవ చేసిన నాయకులకు, కార్యకర్తలకు తగిన గౌరవం, ప్రాధాన్యత కల్పించాలని వారు కోరుతున్నారు.
"మాకు ఈ నాయకుడు వద్దు.. ప్రజల గురించి ఆలోచించే, పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించే కొత్త నాయకత్వం కావాలి" అని పలువురు కార్యకర్తలు బహిరంగంగానే తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ బలోపేతానికి నిజాయితీగా కృషి చేసిన వారికి అవకాశాలు కల్పించి, కార్యకర్తల అభిప్రాయాలకు విలువ ఇచ్చే నాయకుడిని నియమించాలని వారు పార్టీ అధిష్టానాన్ని కోరుతున్నారు.
కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని, వారి కష్టాన్ని గుర్తించినప్పుడే పార్టీ మరింత బలపడుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం వ్యక్తమవుతున్న అసంతృప్తిపై పార్టీ అధిష్టానం ఎలా స్పందిస్తుందో వేచి చూడాల్సి ఉంది.

# గొర్రెల కాపరుల గొంతుగా జిఎంపిఎస్

స్ఫూర్తి యాత్రతో మరో ఉద్యమానికి శంఖారావం;డా. ఊర రామ్మూర్తి యాదవ్




సూర్యాపేట జులై 9 వుదయం : 30 ఏళ్ల గొర్రెల, మేకల పెంపకం దారుల ఉద్యమ ప్రస్థానంలో అమరులైన వీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ నిర్వహిస్తున్న స్ఫూర్తి యాత్ర అభినందనీయమని ప్రముఖ వైద్యులు డా. ఊర రామ్మూర్తి యాదవ్ అన్నారు.గురువారం జనగామ జిల్లా కడివెండి గ్రామంలోని తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య స్మారక స్థూపం నుండి ప్రారంభమైన స్ఫూర్తి యాత్ర సూర్యాపేట జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా సూర్యాపేట పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.
అనంతరం జరిగిన సభలో డా. రామ్మూర్తి మాట్లాడుతూ గొర్రెల, మేకల పెంపకం దారుల సంఘం ఏర్పడి 30 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా, నాటి నుండి నేటి వరకు ఉద్యమంలో పనిచేస్తూ అమరులైన 40 కుటుంబాలను కలిసి వారి త్యాగాలను గుర్తు చేసుకోవడం గొప్ప విషయమని కొనియాడారు. జిఎంపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడత రవీందర్ మాట్లాడుతూ ఈ 30 ఏళ్ల ఉద్యమ ఫలితంగా 559, 1016 వంటి జీవోలను సాధించిన ఘనత సంఘానికి ఉందని తెలిపారు. చనిపోయిన గొర్రెల కాపరులకు ఇన్సూరెన్స్, వ్యాక్సిన్, గొర్రెల పంపిణీ వంటి అనేక చట్టాలను సంఘం పోరాడి సాధించిందని చెప్పారు.
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అయినా గొర్రెల కాపరులకు ఇచ్చిన హామీలు నేటికీ అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గొర్రెల కాపరులు నిత్యం దొంగల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని, ఆర్థికంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కర్ణాటక తరహాలో గొర్రెల కాపరుల రక్షణ చట్టం చేయాలని, 50 సంవత్సరాలు నిండిన గొర్రెల పెంపకం దారులకు రూ. 7,000 పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా మరో ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిఎంపిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బొల్లం అశోక్, రాష్ట్ర నాయకులు చల్ల మల్లయ్య, జిల్లెల్ల పెంటయ్య, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కడెం లింగయ్య, ఉప్పుల రమేష్, నాయకులు మట్టి పెల్లి సైదులు, వజ్జా వినయ్ యాదవ్, కంచుగట్ల శ్రీనివాస్, కంబాలపల్లి శ్రీనివాస్, రాజుల నాగరాజు, భయ్యా మల్లికార్జున్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# బాధితులెవరైనా సమాన గౌరవం స్వీపర్ దంపతులకు ఎస్పీ నరసింహ భరోసా



సూర్యాపేట జులై 9 వుదయం :జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చే ప్రతి బాధితుడికి చట్టం ముందు సమాన గౌరవం, మర్యాద దక్కుతుందని జిల్లా ఎస్పీ నరసింహ, ఐపిఎస్ మరోసారి నిరూపించారు.తన కార్యాలయంలోనే తాత్కాలిక ప్రాతిపదికన రోజువారీ కూలీలుగా విధులు నిర్వహిస్తున్న స్వీపర్, స్కావెంజర్ దంపతులు బుధవారం బాధితులుగా ప్రజావాణికి రాగా, వారికి అత్యంత గౌరవంతో సమస్యను విని తక్షణ న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.జిల్లా పోలీస్ కార్యాలయంలో షకీరా బేగం, షేక్ షఫీ దంపతులు ఇద్దరూ స్వీపర్, స్కావెంజర్ గా తాత్కాలిక ప్రాతిపదికన పనిచేస్తున్నారు. సూర్యాపేట పట్టణంలో ఒక ప్లాట్ కొనుగోలు విషయంలో తాము తీవ్రంగా మోసపోయామని, లేని ప్లాట్ ను ఉన్నట్లు చూపించి డబ్బులు తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని జిల్లా పోలీస్ ప్రజావాణిలో ఎస్పీ కి ఫిర్యాదు చేశారు.సంశయించిన వారికి ధైర్యం ఇచ్చారు సాధారణంగా ఎస్పీ కార్యాలయానికి వచ్చే బాధితులను ఎస్పీ నరసింహ ఎంతో మర్యాదగా తన ముందు కూర్చోబెట్టుకుని, వారి సమస్యలను ఓపిగ్గా వింటారు. ఈ క్రమంలో తన కార్యాలయంలోనే పనిచేసే సిబ్బంది బాధితులుగా రావడంతో వారు సంశయించారు. అయితే ఎస్పీ వారిని ఆప్యాయంగా పలకరించి, "భయపడవద్దు, కూర్చోండి" అంటూ ఎదురుగా కూర్చోబెట్టి వారి బాధను విన్నారు. వారికి పూర్తి ధైర్యాన్ని, భరోసాని ఇచ్చారు.ఈ మోసంపై తక్షణమే విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు. అండగా నిలిచిన ఎస్పీ స్పందన పట్ల బాధిత దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. "చట్టం ముందు అందరూ సమానమే" అని ఎస్పీ చూపిన మానవత్వాన్ని అందరూ కొనియాడారు.

# ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు





మధిర జూలై 9, వుదయం, : మధిర మండలం కృష్ణాపురం గ్రామంలోని సతీష్ రాశి ల చిరకాల కోరిక ఇందిరమ్మ నివాస గృహం నెరవేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన గ్రామ మాజీ సర్పంచ్ ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ పులిబండ్ల చిట్టిబాబు,గ్రామ సర్పంచ్ భూక్యా నాగేశ్వరరావు, ఏఎంసి డైరెక్టర్ చెంచయ్య వేల్పుల,కర్నాటి శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ కొత్తపల్లి నరసింహారావు,గ్రామ శాఖ అధ్యక్షుడు పోచేపల్లి శంకర్రావు,మెంబర్ కత్తి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం లబ్ధిదారుడు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలు ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ నిరుపేదలకు ఇంటి కలను నెరవేర్చిన ప్రభుత్వం ఇందిరమ్మ ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అని అన్నారు. నిరుపేదలకు అండగా ఉంటూ ఇంకా మరెన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతూ పేదలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు.అనంతరం నాయకులు నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం సందర్భంగా దంపతులకు నూతన వస్త్రాలు బహుకరించారు.

